తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

హైదరాబాద్ - రంగారెడ్డి

మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్

గురువారం

29 అక్టోబర్ 2026

పేజీలు : 08

Follow :




బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 3లో జిహెచ్ఎంసి నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న వాణిజ్య సముదాయం



బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 11, ప్లాట్ నెంబర్ 32 జిహెచ్ఎంసి నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం

జిహెచ్ఎంసి బంజారాహిల్స్ చైన్ మెన్ జగన్

## విధులకు హాజరు కాకపోయినా.. జీతం

సర్కిల్-36లో పనిచేస్తున్న సదరు చైన్‌మెన్ విధులకు హాజరవుతున్నారా? క్షేత్రస్థాయి తనిఖీలు ఎన్ని నిర్వహించారు? కార్యాలయ హాజరు రికార్డులు ఏం చెబుతున్నాయి? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విధులకు సక్రమంగా హాజరుకాకుండానే నెలవారీ వేతనం పొందుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత ఉద్యోగి హాజరు పట్టికలు, బయోమెట్రిక్ వివరాలు, క్షేత్రస్థాయి తనిఖీ రిజిస్టర్లు, విధుల కేటాయింపు రికార్డులను ఉన్నతాధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం లేదా అక్రమాలు జరిగినట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# టౌన్ ప్లానింగ్‌పై

# జగన్ గురి

- విధులకు డుమ్మా.. వసూళ్లలో మాత్రం ముందంజ
- జూబ్లీహిల్స్ సర్కిల్ టౌన్ ప్లానింగ్‌లో అక్రమాల ఆరోపణలు
- జీహెచ్ఎంసీ ఖజానాకు భారీ గండిపడుతోందా?

## చక్రం తిప్పుతున్న చైన్‌మెన్.. నోటీస్‌ల పేరుతో సెటిల్‌మెంట్లా

**ఖైరతాబాద్, అక్టోబర్ 28 (జనం సాక్షి) :**

గ్రేటర్ హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగమే ఇప్పుడు తీవ్ర ఆరోపణల నడుమ నిలుస్తోంది. అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించాల్సిన సిబ్బంది.. నోటీసులు, తనిఖీలు, పనుల నిలిపివేత ఆదేశాల పేరుతో నిర్మాణదారులతో లోపాయికారీ వ్యవహారాలు నడుపుతున్నారనే ఆరోపణలు జూబ్లీహిల్స్ సర్కిల్‌లో కలకలం రేపుతున్నాయి. ముఖ్యంగా సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న ఓ చైన్‌మెన్ వ్యవహారశైలిపై పలు ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన బాధ్యతను పక్కనపెట్టి, వాటి వెనుకే చక్రం తిప్పుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**నిబంధనలు ఒకవైపు.. అక్రమ నిర్మాణాలు మరోవైపు**

హైదరాబాద్‌లో భవన నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం, జీహెచ్ఎంసీ అమలు చేస్తున్న నిబంధనలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలవుతున్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తుల నిర్మాణాలు, అనుమతులు లేని వాణిజ్య భవనాలు వెలుస్తున్నా వాటిని అడ్డుకోవాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాల వల్ల ప్రజలకు నిబంధనలపై నమ్మకం తగ్గడమే కాకుండా, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన వ్యవస్థపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రతి నిర్మాణానికి ఓ రేటు'.. ఆరోపణలపై విచారణ ఏదీ?**

సర్కిల్ పరిధిలోని కొన్ని నిర్మాణాల విషయంలో చైన్‌మెన్ స్థాయిలోనే వ్యవహారాలు చక్కబెడుతున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. నిర్మాణాల స్వభావం, ఉల్లంఘనల తీవ్రతను బట్టి చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉండగా, కొందరు సిబ్బంది నిర్మాణదారులతో రాజీ పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి అక్రమ నిర్మాణానికి ఒక రేటు నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే, ఈ ఆరోపణలను నిర్ధారించేందుకు సంబంధిత ఫిర్యాదులు, తనిఖీ నివేదికలు, అధికారిక రికార్డులు, ఇతర ఆధారాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై శాఖాపరమైన చర్యలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

జూబ్లీహిల్స్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో వస్తున్న ఆరోపణలపై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్లు-3, 11లోని నిర్మాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అనుమతులు, అదనపు అంతస్తులు, వాణిజ్య వినియోగం, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.అలాగే సర్కిల్-36లో సిబ్బంది హాజరు, క్షేత్రస్థాయి తనిఖీలు, నోటీసుల జారీ, తదుపరి చర్యలు, ఫీజుల వసూళ్లపై అంతర్గత ఆడిట్ నిర్వహించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

**మెమోలు ఇచ్చిన మారని బుద్ధి**

సరిగా విధులకు హాజరు కాకుండా నిర్లక్ష్యం వహిస్తునాడని సర్కిల్ అధికారి మెమోను అందజేశాడు. అయినప్పటికీ సదరు చైన్ మెన్ ఐ డోంట్ కేర్ అంటు తన అక్రమ సంపద కోసం వసూళ్లు పాలుపడుతుందాం విశేషం. వీఐపీ లు ఉండే జూబ్లీహిల్స్ సర్కిల్లో చైన్ మెన్ లీలలు పై పలువురు విస్మయం వ్యక్తం చేస్తునారు.

## నోటీసులిచ్చి.. ఆ తర్వాత ఏమైంది?

బంజారాహిల్స్ రోడ్ నంబర్-3లో రెస్టారెంట్ కోసం అనుమతులు లేకుండా నిర్మాణ పనులు చేపట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో నిర్మాణాన్ని పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన సిబ్బంది ఎందుకు మౌనంగా ఉన్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. సంబంధిత చైన్‌మెన్ నిర్మాణదారులకు పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, వాటిపై అధికారిక విచారణ ద్వారా వాస్తవాలు తేలాల్సి ఉంది. మరోవైపు, బంజారాహిల్స్ రోడ్ నంబర్-11లో అనుమతులకు మించి రెండు అదనపు అంతస్తులు నిర్మించినట్లు ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలనకు ఆదేశించినప్పటికీ, నిర్మాణ పనులు నిజంగా నిలిచిపోయాయా? నిబంధనల ఉల్లంఘనపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.



బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 11 లో సెల్లార్ పర్మిషన్ పొందకుండా మరో రెండు అంతస్తులతో పాటు అక్రమ నిర్మిస్తున్న భారీ షెడ్

## ఏసీపీ ఆదేశాలకూ విలువ లేదా?

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ ఏసీపీ స్థాయి అధికారులు ఆదేశించినప్పటికీ, క్షేత్రస్థాయిలో వాటి అమలు ఎలా ఉందన్నది కీలకంగా మారింది. ఆదేశాలు జారీ చేయడం ఒక ఎత్తయితే, వాటిని అమలు చేయించడం మరో ఎత్తు. అధికారుల ఆదేశాలను పట్టించుకోకుండా అక్రమ నిర్మాణాలు కొనసాగితే బాధ్యత ఎవరిది? నిర్మాణ పనులను అడ్డుకోవాల్సిన సిబ్బంది ఎందుకు విఫలమవుతున్నారు? అనే ప్రశ్నలకు జీహెచ్ఎంసీ అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా వదిలేస్తే ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగే అవకాశం ఉంది. అయితే, ఈ వ్యవహారాల్లో వాస్తవంగా ఎంత ఆదాయ నష్టం జరిగిందో సంబంధిత భవనాల అనుమతులు, ఉల్లంఘనల వివరాలు, ఫీజుల లెక్కలు పరిశీలించిన తర్వాతే తేలుతుంది.

# ఓఎస్ఎఫ్ పథకం కింద రూ.30 లక్షల రుణాల చెక్కుల పంపిణీ



కొడంగల్, అక్టోబర్ 28 (జనం సాక్షి):వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలంలోని ఐకేపీ కార్యాలయంలో ఓఎస్ఎఫ్ కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రామాలకు చెందిన 60 మంది లబ్ధిదారులకు జీవనోపాధి కార్యక్రమాల నిర్వహణ కోసం రూ.30 లక్షల నిధులకు సంబంధించిన చెక్కులను గ్రామ సంఘాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు రుణాల రీపేమెంట్ షెడ్యూల్, చేపట్టాల్సిన జీవనోపాధి కార్యక్రమాలు, మార్కెటింగ్ సదుపాయాల గురించి వివరించారు. అదేవిధంగా రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లబ్ధిదారుల చెక్కుల పంపిణీ కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ డీపీఎం (ఐబీ) నర్సింహులు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అంజమ్మ, కార్యదర్శి మాసనమ్మ, కోశాధికారి సత్యమ్మ, ఏపీఎం పి. గోపాల్, సీసీలు ఆర్. రాములు, బసంత్, జి. రాములు, బషీరాబాద్ రాములు, మెంటర్ కృష్ణవేణి, బీడీఎస్పీలు, వీఓఏలు, లబ్ధిదారులు పాల్గొన్నారు

# చర్లపల్లి లో పి హెచ్ సి మంజూరు చేయాలని

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



కాప్రా, అక్టోబర్ 28 ( జనం సాక్షి ) : చర్లపల్లి ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ( పి హెచ్ సి ) మంజూరు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆనంద్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చర్లపల్లి ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు ఆవశ్యకతను ఎమ్మెల్యే వివరించారు. స్థానిక ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కావడంతో పాటు, అత్యవసర సమయాల్లో మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడానికి పి హెచ్ సి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై స్పందించ డిఎంహెచ్ ఓ త్వరలోనే చర్లపల్లి ప్రాంతాన్ని సందర్శించి, పి హెచ్ సి ఏర్పాటుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలను పరిశీలించి, అవసరమైన వివరాలను సేకరిస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, మహేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే జైలుకే!

## 71 మందికి రూ.2.02 లక్షల జరిమానా.. ఇద్దరికి జైలు శిక్ష



జవహర్ నగర్, అక్టోబర్ 28 (జనంసాక్షి):మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని జవహర్ నగర్ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. అక్టోబర్ నెలలో నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 71 మందికి కుషాయిగూడలోని 5వ స్పెషల్ ఎంఎం కోర్టు మొత్తం రూ. 2,02,500 జరిమానా విధించింది. మరో ఇద్దరికి జరిమానాతో పాటు జైలు శిక్షలు విధించింది. ఒకరికి రూ. 2,000 జరిమానాతో 14 రోజుల జైలు శిక్ష, మరొకరికి రూ. 4,000 జరిమానాతో నాలుగు రోజుల జైలు శిక్ష విధించింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ కే. శివశంకర్ మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల ప్రాణాలకు ముప్పు కలగడమే అన్నారు. మద్యం సేవించిన వారు వాహనం నడపకుండా క్యాబ్, ఆటో లేదా ఇతర ప్రత్యామ్నాయాలను ఆశ్రయించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై తనిఖీలు మరింత ముమ్మరం చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నూతన బస్సు సర్వీస్ ప్రారంభం

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు



కేశంపేట, అక్టోబర్ 28 (జనం సాక్షి ): మండల పరిధిలోని పుట్టోనిగూడ గ్రామం నుండి షాద్ నగర్ పట్టణానికి బుధవారం నూతన ఆర్టీసీ బస్సు సర్వీస్ ప్రారంభమైంది. బస్సు సర్వీసును గ్రామ సర్పంచ్ కాట్రావత్ చక్లి భాస్కర్ నాయక్ గ్రామస్తులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. గ్రామం నుండి షాద్ నగర్ పట్టణానికి వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేక గ్రామస్తులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో విషయాన్ని సర్పంచ్ చక్లి భాస్కర్ నాయక్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే గ్రామానికి బస్సు సౌకర్యాన్ని కల్పించారు. గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యేకు గ్రామ సర్పంచ్, పాలకవర్గంతో పాటు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనుమగళ్ల రమేష్, పీఏసీఎస్ చైర్మన్ యెన్నం శ్రీధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు గూడ వీరేష్, సర్పంచులు లంకాల సురేష్ రెడ్డి , ఎదిరే నాగేశ్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, సింగిల్ విండో డైరెక్టర్ లు రావుల పెంటయ్య, బండెల రాజేందర్ రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ వేముల రాజు, వార్డు సభ్యులు పెద్దిని విజయమ్మ కృష్ణయ్య, పట్నం కుమార్, లక్ష్మి శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బీస కరుణాకర్ రెడ్డి, పల్లెమోని నర్సింహులు, కోడూరు రాములు, రూప్లా నాయక్, ఇబ్రహీం, వి. కిషన్ నాయక్, గుండెగళ్ల ఆంజయ్య, గోపని భీమయ్య, నాగిళ్ల భాస్కర్, ప్రకాష్ గౌడ్, వెంకటేష్, పర్వతాలు, శ్రీనాద్, మల్లేష్ యాదవ్, లింగం, సోప్పరి జంగయ్య, గ్రామ నాయకులు ప్రవీణ్ యాదవ్, పెద్దిని రాజు, పట్నం రాజు, పెద్దిని ప్రభాకర్, తోకల బాలరాజ్, సదానందం గౌడ్, బాలరాజ్ పాల్గొన్నారు.

# ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాడుదాం

## ఈ నెల 31న కొత్తగూడెంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ 17వ ఆవిర్భావ సభ

## సభను విజయవంతం చేయాలని పాశం యాదగిరి పిలుపు



ముషీరాబాద్, అక్టోబర్ 28 (జనం సాక్షి): తెలంగాణ ప్రజాఫ్రంట్ 17వ ఆవిర్భావ సభను ఈ నెల 31న కొత్తగూడెంలో విజయవంతం చేయాలని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి పిలుపునిచ్చారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కడమంచి రాంబాబు, పాశం యాదగిరి, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమ నాయకుడు ఆజాద్ ఆధ్వర్యంలో సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాశం యాదగిరి మాట్లాడుతూ, తెలంగాణలోని అన్ని రంగాలు దళారులు, పెట్టుబడిదారుల ఆధిపత్యం కారణంగా విధ్వంసానికి గురవుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, తెలంగాణను ప్రజాస్వామికంగా అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందని అన్నారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడమే ఇందుకు మార్గమని, ఆ దిశగా తెలంగాణ ప్రజాఫ్రంట్ కృషి చేస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వంపై మరోసారి కోస్తాంధ్ర పెట్టుబడిదారుల ఆధిపత్యం పెరుగుతోందని ఆయన విమర్శించారు. ఈ ఆధిపత్యానికి వ్యతిరేకంగా "ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాడుదాం" అనే నినాదంతో కొత్తగూడెంలో నిర్వహించనున్న 17వ ఆవిర్భావ సభకు విద్యార్థులు, మేధావులు, కార్మికులు, రైతులు, మహిళలు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సందీప్, రాజేష్, రమేష్, పైడి జనార్ధన్ తదితర వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మూడు నెలలుగా డ్రైనేజీ మురుగుతో నరకయాతన

- చింతలకుంట చెక్‌పోస్ట్ జహంగీర్ కాలనీలో
- దుర్వాసనతో ఇబ్బందులు పొంగిపొర్లుతున్న మురుగునీరు
- స్పందించని అధికారులపై స్థానికుల ఆవేదన



హయత్ నగర్, అక్టోబర్ 28 (జనం సాక్షి)చింతలకుంట చెక్‌పోస్ట్ సమీపంలోని జహంగీర్ కాలనీ, హనుమాన్ కమాన్ పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా మారింది. గత మూడు నెలలుగా మురుగునీరు పొంగిపొర్లుతూ దుర్వాసన వెదజల్లుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. కాలనీలో డ్రైనేజీ మురుగునీరు నిల్వ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భరించలేని దుర్వాసనతో ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు పెరిగి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, అధికారులు తక్షణమే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### అస్తవ్యస్తంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ

కాలనీలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థకు సంబంధించిన సమస్యలు కూడా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. మౌలిక సదుపాయాల నిర్వహణపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. డ్రైనేజీ సమస్యకు తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా, శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### ఉన్నతాధికారులు స్పందించాలి

మూడు నెలలుగా సమస్య కొనసాగుతున్నప్పటికీ పరిష్కారం లభించకపోవడంపై కాలనీవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది వెంటనే స్పందించి పొంగిపొర్లుతున్న మురుగునీటిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. అవసరమైన చోట్ల డ్రైనేజీ పైపులైన్లకు మరమ్మతులు చేపట్టి, రోడ్లను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. జహంగీర్ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యకు ఇప్పటికైనా పరిష్కారం లభిస్తుందా అని కాలనీవాసులు ఎదురుచూస్తున్నారు.

# ఎంబిబిఎస్ చదువుతున్న అనిల్‌కు లక్ష ఆర్థిక సహాయం



మర్పల్లి అక్టోబర్ 29 (జనంసాక్షి) వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని పట్లూర్ గ్రామానికి చెందిన ఘనపూర్ అనిల్ గాంధీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆయన ఆర్థిక స్తోమత అంతంత మాత్రమే ఉండడంతో గ్యాక్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వికారాబాద్లో తన క్యాంపు కార్యాలయంలో బుధవారం 1 లక్ష చెక్కును గ్యాక్ ట్రస్ట్ ఫౌండర్, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అనిల్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాములు యాదవ్, చామల రఘుపతి రెడ్డి, మాజీ ఎంపీటీసీ సురేష్ స్వప్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టీబీ నిర్మూలనకు శాఖల సమన్వయం, ప్రజల భాగస్వామ్యం కీలకం

### జోష్ బృందాలతో క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు

**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** టీబీ ముక్త్ భారత్ అభియాన్ లక్ష్యాలను సాధించేం దుకు అన్ని ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, యువజన సంఘాలు సమన్వయంతో పనిచేయాలని హైదరాబాద్ అదనపు కలెక్టర్ జి.జితేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమం(ఎన్.టీ.ఈ.పీ), హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో జోష్ (జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్)-టీబీ ముక్త్ భారత్ అభియాన్‌పై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు జరిగిన ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జి.జితేందర్ రెడ్డి పాల్గొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.పుట్ల శ్రీనివాస్, జిల్లా క్షయవ్యాధి నియంత్రణ అధికారి డా.జి. యాదగిరి, వైద్య కళాశాలల ప్రతినిధులు, మై భారత్ యువజన అధికారులు, ఎన్.సీ.సీ అధికా రులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఎన్. టీ.ఈ.పీ సిబ్బంది పాల్గొన్నారు. టీబీ నిర్మూలన చర్యలను వేగవంతం చేయడం, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, ప్రజల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంపై సమావే శంలో చర్చించారు. మై భారత్ వాలంటీర్లు, ఎన్. సీ.సీ క్యాడెట్లతో కూడిన జోష్ బృందాల ద్వారా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చడంపై ప్రత్యేక దృష్టి సారించారు. టీబీ లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, అనుమానిత కేసులను ముందుగానే గుర్తించడం, సకాలంలో పరీక్షలు చేయించుకుని చికిత్స పొందేలా ప్రోత్స హించడం, వ్యాధిపై ఉన్న అపోహలు, వివక్షను తొలగించడం ఈ బృందాల



ప్రధాన లక్ష్యాలని వివరించారు. ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, వైద్య కళాశాలలు, యువజన సంస్థలు, సమాజ ప్రతినిధులు చురుకుగా భాగస్వాములు కావాలని సూచించారు. టీబీ అనుమానితులను వెంటనే ఆరోగ్య కేంద్రాలకు పంపించడం, రోగులు చికిత్సను క్రమం తప్పకుండా కొనసాగించేలా సహకరించడం, నిక్షయ్ మిత్ర కార్యక్రమం ద్వారా రోగులకు అవసరమైన సహాయాన్ని అందించడంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని సమావేశం పిలుపునిచ్చింది. టీబీ ముక్త్ హైదరాబాద్, టీబీ ముక్త్ భారత్ లక్ష్యాల సాధనకు జిల్లా యంత్రాంగం, హైదరాబాద్ ఎన్.టీ.ఈ.పీ సమన్వయంతో పనిచేస్తాయని అధికారులు స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా జోష్ బృందాలు, టీబీ ముక్త్ భారత్ అభియాన్‌ను విజయవంతంగా అమలు చేసేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు, సీనియర్ పబ్లిక్ హెల్త్ అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

# యాచారంలో ఘనంగా ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు

**యాచారం, అక్టోబర్ 28 (జనం సాక్షి ):** తెలంగాణ గ్రామీణ బ్యాంక్, యాచారం శాఖ ఆధ్వర్యంలో బుధవారం యాచారం గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత మరియు అవగాహన సదస్సు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, యువకులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సదస్సును విజయవంతం చేశారు.గ్రామీణ ప్రాంతాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలు, డిజిటల్ లావాదేవీలు, సురక్షితమైన ఆర్థిక నిర్వహణ, ప్రభుత్వ బీమా పథకాలు పొదుపు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ నక్క అలివేలు వెంకటేష్ యాదవ్, ఉపసర్పంచ్ సభావత్ కిషన్ నాయక్ ముఖ్య అతిథులుగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలను, బ్యాంకింగ్ సదుపాయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగా ఎదిగేందుకు సరైన పొదుపు అలవాట్లు ఎంతగానో దోహదపడతాయని పిలుపునిచ్చారు. గ్రామీణ ఆర్థికాభివృద్ధిలో నాబార్డ్ మరియు గ్రామీణ బ్యాంకుల పాత్రను వివరించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు అందుబాటులో ఉన్న రుణాలు, సబ్సిడీ పథకాల గురించి అవగాహన కల్పించారు.బ్యాంకు అందిస్తున్న వివిధ రకాల రుణ



పథకాలు, రూపే కార్డ్ సేవలు, మరియు డిజిటల్ మోసాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు విలువైన సూచనలు చేశారు.ఈ సదస్సులో నాబార్డ్ డి డి ఎం హర్ష రఘురాం,తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ రామారావు,తెలంగాణ గ్రామీణ బ్యాంక్ యాచారం శాఖ మేనేజర్ గురుస్వామి, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి సునీల్ కుమార్, గ్రామ పెద్దలు, వివిధ సంఘాల నాయకులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# వెంకటేశ్వర కాలనీ హిందూ స్మశాన వాటికకు మహర్దశ!



- **రూ.11 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
- **స్మశాన వాటికను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం**
- **: మల్లెపూల శ్రీకాంత్ యాదవ్**

**జవహర్ నగర్, అక్టోబర్ 28 (జనంసాక్షి):**చంద్రపురి డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో ఉన్న హిందూ స్మశాన వాటికను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ చంద్రపురి కాలనీ డివిజన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. స్మశాన వాటికలో రూ.11 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ బింగి లావణ్య సతీష్ గౌడ్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ, స్మశాన వాటికకు వచ్చే ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్మశాన వాటికను మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో అదనపు నిధులు సమకూర్చుకుని మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని వెల్లడించారు. స్థానిక ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ, స్మశాన వాటిక అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొడుగు వేణు, సీనియర్ నాయకులు మందుల రజిత గోపాల్, కారింగుల రాజు గౌడ్, డివిజన్ ఉపాధ్యక్షుడు చిట్టి బాబు, ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్, జోగి సునీత, మాధవరెడ్డి, కోశాధికారి అశోక్ గుప్తా, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాహుల్ కదం, పార్టీ నాయకులు సాయి కృష్ణ (మిట్టు), బబ్లూ ముదిరాజ్, భాస్కర్ గౌడ్, కిషోర్, మంజుల, రవి, శ్రీరామ్, ఇరగదిండ్ల రాజు, నిర్వాహకులు యాదయ్య, యాదగిరి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పరిపల్లిలో 617 ఎకరాల భూమికి రీ సర్వే



**కొడంగల్, అక్టోబర్ 28 (జనం సాక్షి):**వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం ఉప్పరిపల్లి గ్రామంలో భూముల రీ సర్వే నిర్వహిస్తున్నారు. గ్రామంలోని 60 సర్వే నంబర్ల పరిధిలో ఉన్న మొత్తం 617 ఎకరాల భూమికి సంబంధించి రీ సర్వే చేపట్టారు. ఇందులో పట్టా భూములతో పాటు ప్రభుత్వ భూములు, గ్రామకంఠం భూములను కూడా సర్వే చేస్తున్నారు.భూముల హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, భూములకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేసేందుకు ఈ రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ మాహేష్, గ్రామ జీపీఓ పి. శ్రీనివాస్, సర్పంచ్ ఎల్లప్ప, ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, వార్డు సభ్యులు అలివేలు, శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఉప్పరి తుల్జప్ప, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటరు నమోదును వేగవంతం చేయాలి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**అల్వాల్, అక్టోబరు 28 (జనంసాక్షి):** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. మంగళవారం అల్వాల్ డివిజన్‌లోని లయోలా కళాశాలలో కొనసాగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కళాశాల యాజమాన్యంతో మాట్లాడి నమోదు ప్రక్రియ పురోగతిని తెలుసుకున్నారు.2023 నవంబరు 1 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఎన్నికల నిబంధనల ప్రకారం అవసరమైన పత్రాలను సమర్పించి ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అర్హులందరికీ ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరించి, ఎవరూ నమోదు అవకాశాన్ని కోల్పోకుండా చూడాలని కళాశాల యాజమాన్యానికి తెలిపారు.ఈ కార్యక్రమంలో లయోలా కళాశాల కరస్పాండెంట్ రెక్స్ అంజిలో, ప్రిన్సిపల్ బుజ్జిబాబు, మాజీ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి, లియోనార్డ్ మీగర్, తోట నరేందర్‌రెడ్డి, జె.ఎ.సి. సురేందర్‌రెడ్డి, డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, అరుణ్‌రావు, శరణ్‌గిరి, సురేష్, సందీప్, ఆరిఫ్, రెహమత్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామంలో కరెంటు సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతాం

**గ్రామంలో కరెంటు సమస్యలను తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడతామని భాకారం జాగీర్ గ్రామ సర్పంచ్ ఎల్లని వెంకటేష్ గౌడ్ తెలిపారు**



**మొయినాబాద్,అక్టోబర్28, జనంసాక్షి:**మొయినాబాద్ మండల పరిధిలోని భాకారం జాగిర్ గ్రామపంచాయతీ పరిధిలో ఎన్నో ఏళ్లుగా ట్రాన్స్ఫారం వద్ద విద్యుత్ సమస్యలు ఏర్పడేటివి అదేవిధంగా కొంగలగడ్డగా పిలవబడే ట్రాన్స్ఫారం వైపుగా వచ్చే పశువులు, మేకలు, బర్రెలు వంటివి ఎన్నో పక్షులు కూడా ప్రాణాలు కోల్పోవడం జరిగింది. పొలాలకు వెళ్లే ప్రజలకు,రైతులకు సైతం ఈ ట్రాన్స్ఫారం వద్ద నుండి వెళ్లాలంటే ప్రాణాలు సైతం అరిచేతులు పెట్టుకొని పోవాల్సిన పరిస్థితి ఉండేది. దీంతో విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ ఎల్లని వెంకటేష్ గౌడ్ విద్యుత్ అధికారులతో మాట్లాడి నూతన ట్రాన్స్ఫారం దిమ్మెను మరియు ట్రాన్స్ఫారం స్థానాచలం చేసి నూతన స్తంభాలతో ట్రాన్స్ఫారం ను గ్రామ ప్రజలకు రైతులకు అటుగా వచ్చే పశు వులకు కూడా ఎలాంటి హాని కలవకుండా దాని యొక్క స్థానాన్ని మార్చి సైడ్ కి పెట్టించడం జరిగింది. ఈ సందర్భంగా బాకారం జాగీర్ గ్రామ ప్రజలు, రైతులు గ్రామ సర్పంచ్ కి పాలకవర్గానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## దర్గా పునర్నిర్మాణానికి చొరవ చూపాలి

**ఎంఐఎం ఎమ్మెల్యే ముబీన్‌కు మైనారిటీ నాయకుడు ఎస్.ఎం. గౌసన్ వినతి**



**కొడంగల్, అక్టోబర్ 28 (జనం సాక్షి):** కొడంగల్ పట్టణంలో రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనుల సందర్భంగా తొలగించిన మహిబూబ్ సుభాని దర్గా, ఇతర మతపరమైన స్థలాలను పునర్నిర్మించేందుకు చొరవ చూపాలని మైనారిటీ నాయకుడు ఎస్.ఎం. గౌసన్ కోరారు. కొడంగల్‌లోని ఎంఐఎం పార్టీ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే ముబీన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.ఎం. గౌసన్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దర్గా, ఇతర మతపరమైన స్థలాలను పునర్నిర్మిస్తామని హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు అమలు కాకపోవడం బాధాకరమన్నారు. ముస్లిం మైనారిటీల మనోభావాలకు సంబంధించిన ఈ సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించి, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ సమస్యను ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీల దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి దర్గా, ఇతర మతపరమైన స్థలాల పునర్నిర్మాణానికి కృషి చేయాలని ఎమ్మెల్యే ముబీన్‌కు విజ్ఞప్తి చేశారు.

## రైతులకు సబ్సిడీపై మినుములు, కందుల విత్తనాల పంపిణీ



**మర్పల్లి అక్టోబర్ 29 (జనంసాక్షి)** రైతులకు సాగు ఖర్చులు తగ్గించి, పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై మినుములు, కందుల విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతుందని ఏవో శ్రీకాంత్ తెలిపారు మినుముల విత్తనాలు: 2 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని, ఒక్క 4 కిలోల బ్యాగ్‌కు రైతు ధర ₹168, కందుల విత్తనాలు 5 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని ఒక్కో 4 కిలోల బ్యాగ్‌కు రైతు ధర ₹160 అని ఆయన తెలిపారు. ఆసక్తి గల రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను ఏఈఓ లను సంప్రదించి విత్తనాలను పొందగలరు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పప్పుధాన్యాల సాగును చేపట్టాలని వ్యవసాయ శాఖ సూచిస్తుందని మండల వ్యవసాయ అధికారి బుధవారం తెలిపారు.

## అరుణోదయ కాలనీ నూతన కార్యవర్గానికి

**శుభాకాంక్షలు తెలిపిన కళ్లెం నవజీవన్ రెడ్డి**



**హయత్‌నగర్, అక్టోబర్ 28 (జనం సాక్షి)**హయత్ నగర్ డివిజన్ లోని అరుణోదయ కాలనీ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు నవజీవన్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. కాలనీ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై వారితో చర్చించారు. కాలనీలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి, మౌలిక సదుపాయాల కల్పనకు నూతన కార్యవర్గ సభ్యులు సమన్వయంతో కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ కాలనీ అధ్యక్షుడు గుమ్మి మధుసూదన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు జగన్ మోహన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, అశోక్ రావు, జంగారెడ్డి, పొల్లి రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మల్లారెడ్డి, సత్యలక్ష్మి, బాలమణి, మణి, కళ తదితరులు పాల్గొన్నారు.

# గ్యాంగడా గ్రామంలో సమయపాలన అంగన్వాడి టీచర్ రాజేశ్వరి

**ఐసిడిఎస్ అధికారులకు సమాచారమిచ్చిన స్పందించని అధికారులు**

**నవాబుపేట్ అక్టోబర్ 28 (జనం సాక్షి):** మండల పరిధిలోని గంగాడ గ్రామంలో అంగన్వాడి సెంటర్ సమయము 10:00 గంటలు అయినా సెంటరు కు తాళాలు తీయని వైనం మా సెంటర్ మా ఇష్టం ఎప్పుడైనా వస్తాము ఎప్పుడైనా వెళ్తాము అంటూ అంగన్వాడి టీచర్ రాజేశ్వరి సమయపాలనం పాటించకుండా ఇష్టనుసారంగా వ్యవహరిస్తున్న అంగన్వాడి సెంటర్ సెంటర్లో ప్రస్తుతం 20 మంది విద్యార్థులు ఉండగా అంగన్వాడి టీచర్ ఉదయము 9 గంటలకు సమయాన్ని పక్కనపెట్టి ఎప్పుడు వస్తుందో ఎప్పుడు వెళుతుందో అంతు పట్టని వైనం. ప్రస్తుతము 12 మంది అంగన్వాడి సెంటర్లో ఉదయము 10 గంటలకు టీచర్ వస్తుండగా విద్యార్థులు ఎక్కడ కనిపించడం లేదు. ఆయా మాధవి 8:45 కి రావాల్సిన సమయాన్ని పక్కనపెట్టి 9 గంటల ముప్పై ఐదు నిమిషాలకు వస్తున్న సంఘటన గ్రామస్తులు అంగన్వాడి టీచర్ను అడగగా మాకు పనులు ఉన్నవి మా ఇష్టం మా సెంటర్ ఎప్పుడైనా వస్తాము మీరు ఎందుకు నన్ను అడగడానికి అంటూ గ్రామస్తులపై కొట్లాటకు దిగుతున్న సంఘటన. వికారాబాద్ జిల్లా సిడిపిఓ అధికారి శ్రీలతకు సమాచారం ఇచ్చిన చూద్దాంలే చేద్దాం అంటూ అంగన్వాడి టీచర్లతో కుమ్మక ఐ కలిసిపోయిన సంఘటన అని గ్రామస్తులు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారు అంతుపట్టని అంగన్వాడి టీచర్ కొలువులు. వికారాబాద్ జిల్లా అధికారికి సమాచారం ఇచ్చిన వెంటనే అంగన్వాడి టీచర్లు గవర్నమెంట్ కాదు అంటూ అంగన్వాడి టీచర్స్ కి వస్తున్నా టిడిపి ఓ అధికారి. అంగన్వాడి టీచర్లు గ్రామంలోని రైతు సంవత్సరాల చిన్నారులకు పౌష్టికాహారం, గుడ్లు, మధ్యాహ్న భోజనం లో కూరగాయలు లేక నీళ్ల సార్ తో పిల్లలకు అన్నం పెట్టి. గ్రామంలోని గర్భిణీలకు మధ్యాహ్న భోజనంలో ఆకుకూరలు, కూరగాయలు, పెరుగు పాలు, ఇచ్చేవి నలుగురికి రికార్డులు రాసేవి 10 మందికి అంగన్వాడి సెంటర్లలో ఎంత గందరగోళం జరుగుతుందో ఎవరికి చెప్పాలో



అంటూ గ్రామ ప్రజలు ఆవేదన. అంగన్వాడి సెంటర్లకు కమిటీలు నిర్వహించారు గ్రామ సర్పంచి కన్వీనర్, వాడు సభ్యులు గ్రామస్తులు అంగన్వాడి టీచర్ ఆ యొక్క సమావేశము ఎక్కడ జరిగిన సంఘటనలు లేవు నామమాత్రంగా టీచర్లు సెంటర్లకు ఎప్పుడు వస్తున్నారు ఎప్పుడు వెళుతున్నారు. ఏ సెంటర్లో కూడా ఎక్కడ చూసినా విద్యార్థులు కనిపించని వైన్యం అందుకు పై అధికారులు అంగన్వాడి సెంటర్లలో చిన్నారులకు, గర్భిణీలకు ప్రభుత్వం అందించే అన్ని సౌకర్యాలు అందించాలని గ్రామస్తులు పేర్కొన్నారు.

# బాలల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

**ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు, మొబైల్ హెల్త్ టీమ్‌లకు డీఎంహెచ్‌వో**

**డాక్టర్ కె.ఆనంద్ సూచన**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 28 (జనంసాక్షి)**మేడ్చల్ మల్కాజిగిరి: బాలల్లో ఆరోగ్య సమస్యలను తొలిదశలోనే గుర్తించి, సకాలంలో వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ఆనంద్ సూచించారు. జిల్లాలోని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) వైద్యాధికారులు, మొబైల్ హెల్త్ టీమ్‌ల సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జననం నుంచి 18 ఏళ్లలోపు పిల్లలకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం ఆర్‌బీఎస్‌కే ప్రధాన లక్ష్యమన్నారు. పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకాహార లోపాలు, బాల్య వ్యాధులు, అభివృద్ధిలో జాప్యం, వైకల్యాల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మొబైల్ హెల్త్ టీమ్‌లు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పిల్లల్లో తీవ్రమైన, మధ్యస్థాయి పోషకాహార లోపాలను గుర్తించి, వారి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా వైద్య పర్యవేక్షణ, పోషకాహార సహాయం అందించాలన్నారు. అవసరం లేని సందర్భాల్లో పిల్లలను ఆసుపత్రులకు పంపకుండా మార్గదర్శకాల ప్రకారం చికిత్స అందించాలని



తెలిపారు. తీవ్రమైన సమస్యలున్న పిల్లలను ఉన్నత వైద్య కేంద్రాలకు సకాలంలో పంపించి, తదుపరి చికిత్స అందేలా పర్యవేక్షించాలన్నారు. పోషకాహార లోపాలున్న పిల్లల తల్లిదండ్రులకు సమతుల్య ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, పిల్లల ఎదుగుదలపై అవగాహన కల్పించాలని సూచించారు. పోషకాహార లోపం మరింత తీవ్రం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల సమన్వయంతో పిల్లల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని డాక్టర్ కె.ఆనంద్ పేర్కొన్నారు.

## పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో రక్తదాన శిబిరం.. 169 మంది రక్తదానం

**చేవెళ్ల పోలీసుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం**

**చేవెళ్ల, అక్టోబర్ 28 (జనంసాక్షి)** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి ఆదేశాల మేరకు చేవెళ్ల పోలీసుల ఆధ్వర్యంలో చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్స్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మిత్ర బ్లడ్ సెంటర్, పంజాగుట్ట, హైదరాబాద్, సృజన తలసేమియా బ్లడ్ సెంటర్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో మొత్తం 169 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్, ఏసీపీ కిషన్, చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, సీఐ నరేందర్ రెడ్డి, సీఐ లక్ష్మారెడ్డి, సీఐ మల్లికార్జున్ రెడ్డితో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ.. దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని పేర్కొన్నారు. అమరవీరుల స్ఫూర్తితో సమాజ సేవలో భాగంగా ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పోలీసు సిబ్బంది, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులతో పాటు తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు అవసరమైన రక్తాన్ని అందించేందుకు




రక్తదానం ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంపొందించుకొని, ప్రాణాలను కాపాడే ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ రక్తదాన శిబిరంలో ఎస్‌ఐలు కోటేశ్వరరావు, వెంకటేశ్, రవీందర్ నాయక్, చెన్నారెడ్డి, వనం శిరీష, బెగరీ శిరీష, శ్రీనివాసరావు, మిత్ర బ్లడ్ సెంటర్, సృజన తలసేమియా బ్లడ్ సెంటర్ సిబ్బంది, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్లు పైండ్ల మధుసూధన్ రెడ్డి, కృష్ణ నాయక్, తాళ్లపల్లి నరసింహులు, కేజీ రెడ్డి, జేబీఐటీ, వివేకానంద కళాశాల విద్యార్థులు, యువత, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ వాటర్ ట్యాంకర్లపై చర్యలు తీసుకోవాలి

**పత్తి కుమార్**

**కాప్రా, అక్టోబర్ 28, (జనం సాక్షి ) :** ప్రజల అవసరాల కోసం వినియోగించాల్సిన ప్రభుత్వ బోర్‌వెల్ నీటి వనరులను ప్రైవేట్ ట్యాంకర్ల వ్యాపారం నిర్వహిస్తున్న తక్షణమే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పత్తి కుమార్ అన్నారు. వంపుగూడ గ్రామంలోని ఉన్న ప్రభుత్వ బోర్‌వెల్ నుంచి వాటర్ ట్యాంకర్‌లో నీటిని నింపుకొని అక్రమంగా విక్రయిస్తున్నారనే ఆరోపణలపై పత్తి కుమార్ బుధవారం కాప్రా తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని అక్రమంగా నీటి వ్యాపారం చేస్తున్న ట్యాంకర్లపై చర్యలు తీసుకోవాలని పత్తి కుమార్ కోరారు. ప్రభుత్వ బోర్‌వెల్ నీటి వినియోగంపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రజలకు నీటి కొరత, ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.



# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి రాంబాబు యాదవ్

### జీకేఆర్ ఫాంహౌస్‌లో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం



**చేవెళ్ల, అక్టోబర్ 28 (జనంసాక్షి)** రానున్న రంగారెడ్డి--మహబూబ్‌నగర్--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని చేవెళ్ల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి రాంబాబు యాదవ్ పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో పట్టభద్రుల ఓటర్లను కలిసి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని సూచించారు. బుధవారం చేవెళ్ల మండల పరిధిలోని ముడిమ్యాల్ గ్రామంలో గోనె కరుణాకర్ రెడ్డి వ్యవసాయ క్షేత్రం (జీకేఆర్ ఫాంహౌస్)లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాంబాబు యాదవ్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలిచే పార్టీ అని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి పట్టభద్ర ఓటరును కలిసి పార్టీ విధానాలు, గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, నిరుద్యోగులకు సంబంధించిన అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రభుత్వ పనితీరుపై పట్టభద్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల పరిధిలోని కమ్మెట ఎక్స్‌రోడ్డులో ఉన్న మీ-సేవా కేంద్రంలో పలువురు పట్టభద్రుల ఓటరు నమోదుకు సంబంధించిన ప్రక్రియను చేపట్టి, వారికి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పట్లోళ్ల కృష్ణా రెడ్డి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు వంగ శ్రీధర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు తోట శేఖర్, ముడిమ్యాల్ పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ కేసారం నరేందర్, కౌన్సిలర్లు శ్రీనివాస్ రెడ్డి, దూత మల్లేష్, సువర్ణ చందు, బీఆర్ఎస్ సర్పంచ్‌లు కావలి లక్ష్మీప్రసన్న శేఖర్, బార్లపల్లి మల్లా రెడ్డి, సీనియర్ నాయకులు గోనె కరుణాకర్ రెడ్డి, పట్లోళ్ల హన్మంత్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, ఊరడి రాంప్రసాద్, కసిరె వెంకటేష్, తంగడపల్లి మాజీ సర్పంచ్ అనూష సత్యయ్యగౌడ్, నాయకులు వెంకటేష్, గోనె మాధవ రెడ్డి, గోనె రాహుల్ రెడ్డి, వివిధ గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు.

# పట్టభద్రుల ఓటరు నమోదులో అలసత్వం వద్దు

### ప్రతి డివిజన్‌లో 2 వేల ఓట్ల నమోదు లక్ష్యంగా పనిచేయాలి

### శాసనమండలి విప్, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్



**హయత్‌నగర్, అక్టోబర్ 28 (జనం సాక్షి)**పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటరు నమోదు ప్రక్రియలో ఎవరూ అలసత్వం వహించవద్దని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రతి డివిజన్ నుంచి కనీసం 2 వేల మంది పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించేలా డివిజన్ అధ్యక్షులు ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఏఐపీసీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ఆదేశాల మేరకు బుధవారం హయత్‌నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఎల్బీనగర్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఎల్బీనగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా బల్మూరు వెంకట్ ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించేందుకు కృషి చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని, పార్టీ అభివృద్ధి నాయకులకు రాజకీయంగా మరిన్ని అవకాశాలను కల్పిస్తుందని పేర్కొన్నారు.ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన సామ రామ్మోహన్ రెడ్డి అభ్యర్థిగా ఉన్నందున నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మద్దతు లభించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బల్మూరు వెంకట్ పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటరు నమోదు భవిష్యత్తులో జరిగే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ నాయకులకు కూడా ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ డివిజన్ అధ్యక్షులు తమ పరిధిలోని కార్యకర్తలకు ఓటరు నమోదు బాధ్యతలను అప్పగించాలని సూచించారు. ప్రతి కార్యకర్త కనీసం 20 మంది పట్టభద్రుల ఓటరు నమోదుకు కృషి చేసేలా కార్యాచరణ రూపొందించాలని అన్నారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు దరిపల్లి రాజశేఖర్ రెడ్డి, సుజాత నాయక్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ పృథ్వీ చౌదరి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేదిరె యోగేశ్వర్ రెడ్డి తదితరులు మాట్లాడి పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, జిల్లా కమిటీ ప్రతినిధులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దౌలాపూర్ భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

### రైతుల నిరాహార దీక్షకు కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు మద్దతు



**యాలాల అక్టోబర్ 28 ( జనంసాక్షి ) :** అభివృద్ధి, ఇతర అవసరాల కోసం భూములు కోల్పోయిన దౌలాపూర్ రెవెన్యూ గ్రామ రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. పరిహారం కోసం రైతులు చేపట్టిన నిరాహార దీక్ష బుధవారం మూడో రోజుకు చేరుకోగా, దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన రైతులకు సంఘం తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. భూములే జీవనాధారంగా బతుకుతున్న రైతులు వాటిని కోల్పోయినప్పుడు న్యాయమైన మార్కెట్ ధర ప్రకారం పరిహారం అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. రైతులు మూడు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నా పాలకులు, అధికారులు స్పందించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బాధిత రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి, తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.భూములు కోల్పోయిన రైతుల ఆవేదనను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయరాదని స్కైలాబ్ బాబు అన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు రైతుల పోరాటానికి కేవీపీఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే రైతులకు మద్దతుగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. భూములు కోల్పోయిన కుటుంబాలకు న్యాయమైన నష్టపరిహారంతో పాటు తగిన పునరావాస సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో టీఎస్ ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వాహబ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఎంహెచ్‌ఎస్ నాయకుడు కొత్తూరు చంద్రయ్య, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యు. బుగ్గప్ప, ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకుడు మహేందర్, రైతు నాయకులు, గ్రామస్థులు, కేవీపీఎస్ ప్రతినిధులు నర్సింహులు, వడ్డే పెద్ద వెంకటయ్య, చిన్న వెంకటయ్య, పద్మ, చంద్రయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్లియా క్లినిక్ అండ్ ఫార్మసీ ప్రారంభించిన శేరి సతీష్ రెడ్డి



**కూకట్‌పల్లి, అక్టోబర్ 28(జనంసాక్షి):**కేపీహెచ్ బి కాలనీ టెంపుల్ బస్‌స్టాప్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్లియా క్లినిక్ అండ్ ఫార్మసీని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. డాక్టర్ రాంబాబు ఆహ్వానం మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో శేరి సతీష్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండటం ఎంతో అవసరమని పేర్కొన్నారు. నూతనంగా ప్రారంభమైన క్లినిక్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. డాక్టర్ రాంబాబుకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మేకల మైకేల్, తమ్మినేని ప్రవీణ్, కొమ్ము బాబు, శ్రీధర్ చారి, గిరి నాయుడు, యూత్ కాంగ్రెస్ నాయకులు కళ్యాణ్, దుర్గా, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీకి వెళ్లేందుకు రైళ్లు కేటాయించలేదని కాంగ్రెస్ ధర్నా

### ప్రధాని మోదీ, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు



**సికింద్రాబాద్, (జనం సాక్షి):** ఢిల్లీలో నవంబర్ 1న నిర్వహించనున్న కాంగ్రెస్ నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లు కేటాయించడం లేదని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు బుధవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఎదుట మెరుపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. రైల్ నిలయంలోని జీఎం కార్యాలయం ఎదుట జరిగిన ఈ నిరసనలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, శ్రీగణేశ్, సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమ, డీసీసీ అధ్యక్షులు మోత రోహిత్, దీపక్ జాన్, హైదరాబాద్ జిల్లా ఆర్టిఏ మెంబర్ సురేష్ లాల్ తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ఛలో ఢిల్లీ కార్యక్రమానికి ప్రత్యేక రైలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ నాయకులు నిరసన తెలిపారు. ఈ క్రమంలో చోటుచేసుకున్న తోపులాటలో మహేశ్ కుమార్ గౌడ్, పొన్నం ప్రభాకర్ కిందపడినట్లు సమాచారం. ఢిల్లీలో జరిగే నిరసనలకు వెళ్లేందుకు రైళ్ల కేటాయింపుపై రైల్వే అధికారులు స్పందించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు.

# రక్తదానం మహాదానం.. ప్రాణదానంతో సమానం



**షాబాద్, అక్టోబర్ 28(జనం సాక్షి);** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం చేవెళ్లలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో షాబాద్ బిఆర్ఎస్ మైనార్టీ అధ్యక్షులు ఇమ్రాన్, పలువురి నాయకులతో కలిసి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ గౌతమ్ యోగేష్, ఏసీపీ కిషన్, షాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మిరెడ్డి, ఇన్స్పెక్టర్ చెన్నారెడ్డి తదితరులు పాల్గొని రక్తదాతలను అభినందించారు. రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముకురం ఖాన్, డాక్టర్ ఇమ్రాన్, సోయల్, కలీం, పైల్వాన్ తదితరులు పాల్గొన్నారు.



## పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు భరోసా కళ్యాణలక్ష్మి, షాదీముబారక్

### యాలాల మండలంలో 24 మంది లబ్ధిదారులకు రూ.24.02 లక్షల విలువైన చెక్కుల పంపిణీ

**యాలాల అక్టోబర్ 28 ( జనంసాక్షి ) :** పేద కుటుంబాలకు ఆడబిడ్డల పెళ్లిళ్లు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందిస్తోందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకొని కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఆయన సూచించారు.యాలాల మండలానికి చెందిన 24 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.24,02,784 విలువైన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న సహకారం పేద కుటుంబాలకు ఊరటనిస్తుందని, ఆడబిడ్డల వివాహ సమయంలో ఆర్థిక ఇబ్బందులను కొంతమేర తగ్గించేందుకు ఈ పథకాలు దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయం

### మేకవనం పల్లి సొసైటీ చైర్మన్ శంకర్



**మోమిన్ పేట అక్టోబర్ 2 8 (జనం సాక్షి) :** మోమిన్ పేట మండల పరిధిలోని మేకవనం పల్లి లో ప్రాథమిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రీన్ మెట్రో వారు విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయం అని మేకవనం పల్లి సొసైటీ చైర్మన్ శంకర్ అన్నారు . బుధవారం మేకవనం పల్లి గ్రామంలో నీ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 278 మంది విద్యార్థులకు గ్రీన్ మెట్రో అధినేత బొడ్డు అశోక్ క్రీడాదుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ... ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం ఇలాంటి వ్యక్తులు సహాయ సహకారాలు అందించాలని అన్నారు ప్రైవేట్ పాఠశాలలతో పోటీ పడుతూ ప్రభుత్వం పాఠశాలలో కూడా మెరుగైన విద్యను అందిస్తున్నారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో... సర్పంచ్ సుశీల ప్రధాన ఉపాధ్యాయులు గౌరీశంకర్ గ్రీన్ మెట్రో అధినేత బొడ్డు అశోక్ ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## పోలీస్ అమరవీరుల స్మారకంగా మెగా రక్తదాన శిబిరం




**ధారూర్,అక్టోబర్ 28(జనంసాక్షి) :** పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాల్లో భాగంగా విధి నిర్వహణలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులకు ఘన నివాళు లర్పిస్తూ వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలోని కొండ బాలకృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా పాల్గొని రక్తదాన శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన మాజీ వార్డు సభ్యుడు బేగరి మొగులప్పను అభినందించారు. రక్తదానం ప్రాణాలను కాపాడే మహోన్నత సేవ అని, సమాజంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ శిబిరం సేవాభావానికి ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ సంజీవరావు, ధారూర్ సీఐ రఘురాములు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులు లేకుండా పబ్లిక్ ఇయర్ రింగ్స్ నిర్వహించడం ఏమిటి?

### మూసీ బాధితుల తరపున మాట్లాడితే అరెస్టు చేస్తారా? : బీఆర్ఎస్ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి

**రాజేంద్రనగర్,అక్టోబర్28(జనంసాక్షి) :** "మూసీ బాధితుల సమస్యలను పట్టించుకోకుండా, బాధితులు లేకుండానే పబ్లిక్ హియరింగ్ నిర్వహించడం ఏమిటి? బాధితుల తరపున మాట్లాడేందుకు వస్తే అరెస్టు చేస్తారా?" అని బీఆర్ఎస్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ప్రశ్నించారు. రాజేంద్రనగర్‌లోని వాలంతరి కార్యాలయంలో నిర్వహించిన మూసీ పబ్లిక్ హియరింగ్‌కు వెళ్లిన ఆయనను పోలీసులు బలవంతంగా తీసుకెళ్లడంతో బాధితులు పోలీసు వాహనం ఎదుట ఆందోళన చేపట్టారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు పబ్లిక్ హియరింగ్‌కు హాజరైన ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్, పట్లోళ్ల కార్తీక్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. మూసీ ప్రాజెక్టుతో ఇళ్లు, భూములు కోల్పోయే పరిస్థితిలో ఉన్న బాధితులకు ప్రభుత్వం అండగా నిలవాల్సింది పోయి, వారి తరపున మాట్లాడేవారిని అరెస్టు చేయడం దారుణమన్నారు. ప్రజల అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం కల్పించకుండా అరెస్టులకు పాల్పడటం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్రంలో నిధుల కొరత ఉందంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, లక్ష కోట్ల రూపాయలతో మూసీ ప్రాజెక్టు చేపట్టేందుకు నిధులు ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకొని మూసీ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, వారి హక్కుల కోసం ఎంతదూరమైనా పోరాడుతామని కార్తీక్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రేమ్ గౌడ్, సుభాష్ రెడ్డి, నాగరాజు, లక్ష్మీబాయి, ఎస్. వెంకటేష్ ముదిరాజ్, రాఘవేందర్, బుర్కుంట సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## పత్తి సాగులో కొత్త పంథా.అధిక దిగుబడులే లక్ష్యం

### అల్లిపూర్‌లో అధిక సాంద్రత పత్తి సాగుపై క్షేత్ర పరిశీలన రైతులకు అధికారుల అవగాహన

**ధారూర్,అక్టోబర్ 28 (జనంసాక్షి) :** పత్తి సాగులో అధిక దిగుబడులు సాధించి రైతులకు మెరుగైన ఫలితాలు అందించడమే లక్ష్యంగా వ్యవసాయ శాఖ అధికారులు అధిక సాంద్రత పత్తి సాగుపై ప్రత్యేక దృష్టి సారించారు. ధారూర్ మండల పరిధిలోని అల్లిపూర్ గ్రామంలో బుధవారం కాటన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసిన పత్తి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. రాశి కంపెనీ ఏరియా మేనేజర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాధారణ పద్ధతిలో సాగు చేసిన పత్తి పంటకు, అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసిన పత్తి పంటకు మధ్య ఉన్న తేడాలను పరిశీలించారు. పత్తి సాగులో శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ పంట నిర్వహణ చేపడితే మెరుగైన దిగుబడులు సాధించే అవకాశాలపై రైతులకు వివరించారు.




పత్తి పంటలో మొక్కల నిర్వహణ, చీడపీడల నివారణ, పురుగుల నియంత్రణ, దిగుబడుల పెంపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. సాగులో ఎదురయ్యే సమస్యలను గుర్తించి సరైన సమయంలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై రైతులు ఆసక్తి కనబరచాలని, వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ సాగు చేపట్టాలని తెలిపారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సూర్యప్రకాష్ మాట్లాడుతూ కాటన్ మిషన్ కార్యక్రమం కింద ప్రభుత్వం అందించిన పురుగుమందులను వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన విధంగానే వినియోగించాలని తెలిపారు. పంటలపై ఏవైనా సమస్యలు తలెత్తితే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి తగిన సలహాలు, సూచనలు పొందాలని పేర్కొన్నారు. శాస్త్రీయ సాగు విధానాలను అనుసరించడం ద్వారా పంట నిర్వహణను మెరుగుపరుచుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించే అవకాశాలు ఉంటాయని వివరించారు.

రాశి కంపెనీ ఏరియా మేనేజర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి కంపెనీ తరపున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తూ పత్తి సాగులో మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సంజీవ్ రాథోడ్, కంపెనీ ప్రతినిధి ఆనందరెడ్డి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు అంకిత ఫౌండేషన్ చేయూత అభినందనీయం

### తెలంగాణ విద్యావంతుల వేదిక వికారాబాద్ జిల్లా కన్వీనర్ గౌరారం గోపాల్



**బొంరాస్ పేట, అక్టోబర్ 28 (జనం సాక్షి):** మండల పరిధిలోని వడిచర్ల, బురాన్పూర్ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు బుధవారం అంకిత ఫౌండేషన్ సౌజన్యంతో విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో విద్యా సామాగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ గౌరారం గోపాల్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు అంకిత ఫౌండేషన్ విద్యాసామాగ్రిని అందజేస్తూ చేయూతనందించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఫీల్డ్ ఆఫీసర్లు విజయలక్ష్మి,శరత్ రెడ్డి, ఎఫ్ఎల్ఎన్ జిల్లా కోఆర్డినేటర్ ప్రత్యూష, ప్రధానోపాధ్యాయులు మేరాజ్, సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆలీముద్దీన్, ఇంగ్లీష్ ఆర్పి నరేందర్ గౌడ్, నవీన్ విజయలక్ష్మి నర్సింలు రవి విద్యావతి తదితరులు పాల్గొన్నారు

## నిరుద్యోగ యువత ఆశలకు అండగా..

# ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు ప్రోత్సాహంగా బీఎంఆర్ ఫౌండేషన్

### స్పీకర్, ఎమ్మెల్యే



**తాండూరు ఆక్టోబర్ 28(జనంసాక్షి)** తాండూరు పట్టణంలోని విలియం మూన్ స్కూల్లో బిఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీ పరీక్ష (ఎస్ఐ, కానిస్టేబుల్)లకు సిద్ధమవుతున్న దాదాపు 250 మంది అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ ను అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , జిల్లా కలెక్టర్ దీపక్ తివారి , ఎస్పీ స్నేహ మెహ్రా గార్లతో కలిసి పంపిణీ చేసిన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి.స్పీకర్ మాట్లాడుతూ మీ అభిమాన నాయకుడు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత కోచింగ్‌తో పాటు స్టడీ మెటీరియల్ అందించడం సంతోషకరమని స్పీకర్ పేర్కొన్నారు.బిఎంఆర్ ఫౌండేషన్ ద్వారా 2018లో పరిగిలో నిరుద్యోగ యువత కోసం ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. 2022లో పరిగి నియోజకవర్గంలోని దాదాపు 60 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు గైడ్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు.

పేద కుటుంబాల్లో మరణాలు సంభవించినప్పుడు ఫౌండేషన్ ద్వారా



ఆర్థిక సహాయం అందించి, ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచారని పేర్కొన్నారు.విద్యార్థులు, నిరుద్యోగ యువత, పేద కుటుంబాలకు వివిధ రూపాల్లో సేవలందిస్తున్న బిఎంఆర్ ఫౌండేషన్ కార్యక్రమాలను అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కోచింగ్ కేవలం కానిస్టేబుల్ పోస్టులకే కాదు, రాష్ట్ర స్థాయిలో వచ్చే ఉద్యోగాలకు కూడా ఎంతో ఉపయోగపడుతుంది.నవంబర్ 29, డిసెంబర్ 20న మీకు తొలి పరీక్ష ఉంది. ఇందులో క్వాలిఫై అయిన వారికి గ్రౌండ్ లో పీటీల ద్వారా ఫిజికల్ టెస్ట్ కోచింగ్ ఇప్పించేందుకు కృషి చేస్తా. ఆ తర్వాత ఫైనల్ ఎగ్జామ్ కి కూడా ఫ్రీ కోచింగ్ ఇచ్చేందుకు కృషి చేస్తా. మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పట్టుదలతో చదివి పోలీస్ కొలువు సాధించండి.2018లో పరిగిలో దాదాపు 1,500 మంది అభ్యర్థులతో ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశాను. ఆ శిక్షణ ద్వారా ఎంతోమంది అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం చాలా సంతోషంగా ఉంది. యువత ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడటం నాకు ఎంతో సంతృప్తినిచ్చింది. మీరు ఉద్యోగం సాధించిన తర్వాత, మీలాంటి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ, లక్ష్య సాధన కోసం కష్టపడుతున్న మరో విద్యార్థికి స్ఫూర్తిగా నిలవాలని కోరుకుంటున్నాను.




# సురక్షిత బాల్యం ప్రతి ఒక్కరి బాధ్యత..

### బాలల హక్కుల భద్రతపై అవగాహన

**బొంరాస్ పేట, అక్టోబర్ 28 (జనం సాక్షి):** సురక్షిత బాల్యం ప్రతి ఒక్కరి బాధ్యత మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులు భద్రతపై కొడంగల్ మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ న్యాయమూర్తి ఆదేశాల మేరకు సిబ్బంది బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.బాలలపై జరిగే హింస, లైంగిక వేధింపులు, దోపిడీ,బాలల అక్రమ రవాణా వంటి నేరాల నుంచి పిల్లలను రక్షించాల్సిన అవసరాన్ని కోర్టు సిబ్బంది నీరజా దస్తప్ప వివరించారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఇబ్బందులకు గురిచేసిన ధైర్యంగా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు తెలియజేయాలని, అవసరమైనప్పుడు పోలీసు అధికారులు బాలల రక్షణ విభాగం సహాయ సహకారాలు తీసుకోవాలని వివరించారు. బాలలపై జరిగే నేరాలను అరికట్టి ప్రతి చిన్నారికి సురక్షితమైన బాల్యాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రశాంత్ కుమార్, బాకారం మల్లయ్య,బాకారం చంద్రశేఖర్, శివరాజు,మాధవరెడ్డి,నర్సింలు,లక్ష్మీకాంతరావు, అనిల్ కుమార్,స్రవంతి,వందన, షాహిబా తదితరులు పాల్గొన్నారు.

# మూసీ బాధితులను కలిసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నేతల అరెస్ట్

### మహేష్ యాదవ్‌తో పాటు పలువురు నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు



**ఖైరతాబాద్, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** మూసీ ప్రాజెక్టుతో నష్టపోతున్న బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నాయకత్వంలో బాధిత కుటుంబాలను కలిసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకుడు మహేష్ యాదవ్‌తో పాటు పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. మూసీ ప్రాజెక్టు కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాల సమస్యలను తెలుసుకుని, వారికి అండగా నిలిచేందుకు నాయకులు వెళ్లినట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. అయితే, బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన నాయకులను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకోవడంపై బీఆర్ఎస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు భరోసా కల్పించేందుకు వెళ్లిన వారిని అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. మూసీ ప్రాజెక్టుతో ప్రభావితమయ్యే కుటుంబాలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. బాధితుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, వారికి న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి మధుకర్ యాదవ్, అంజన్ కుమార్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# విబిజిరాంజి పనులను సద్వినియోగం చేసుకుంటున్న కొత్తూరు కూలీలు

### సర్పంచ్ సూర్యకళను అభినందించిన మంత్రి సీతక్క



**బొంరాస్ పేట, అక్టోబర్ 28 ( జనం సాక్షి):**ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు కురవకపోవడంతో ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో విబిజిరాంజీ పథకం ద్వారా ఉపాధి పనులు కల్పించాలని బుధవారం అధికారులు, సర్పంచులు, ఉపాధి హామీ సిబ్బందితో హైదరాబాద్ నుంచి మంత్రి సీతక్క, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.వికారాబాద్ జిల్లాలోని అత్యధికంగా ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవడం పట్ల గ్రామ సర్పంచ్ సూర్య కళను మంత్రి సీతక్క అభినందించారు. ప్రతిరోజు 173 మంది కూలీలు హాజరయ్యేలా తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి అడిగిన ప్రశ్నకు సర్పంచ్ సమాధానం ఇస్తూ గ్రామసభ నిర్వహించి ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించి కూలీల సంఖ్యను పెంచగలిగామని సమాధానం ఇచ్చారు. ప్రతి ఒక్కరూ కూలీల సంఖ్య పెంచి ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీని చాటుకున్న రాపిడో డ్రైవర్



**అమీర్పేట్ /ఎస్సార్ నగర్ (జనంసాక్షి) :** రోడ్డుపై దొరికిన బ్యాగును పోలీసులకు అప్పగించి నిజాయితీని చాటుకున్న రాపిడో బైక్ డ్రైవర్ ఇర్షాద్‌ను ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. ఖైరతాబాద్‌లో నివాసం ఉండే రాపిడో డ్రైవర్ ఇర్షాద్ తన బైక్‌పై కూకట్‌పల్లి నుంచి అమీర్‌పేటకు వస్తుండగా, తన ముందున్న బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తికి చెందిన బ్యాగు కింద పడిపోవడాన్ని గమనించాడు. వెంటనే ఆ బ్యాగును తీసుకుని ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. పోలీసులు బ్యాగును పరిశీలించి, అది కూకట్‌పల్లికి చెందిన రోహిత్‌దిగా గుర్తించి అతనికి తిరిగి అప్పగించారు. బాధ్యతాయుతంగా వ్యవహరించి బ్యాగును పోలీసులకు అందజేసిన ఇర్షాద్‌ను ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. ఇలాంటి నిజాయితీ, బాధ్యతాయుతమైన ప్రవర్తన సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో ఎస్ ఐ మధుసూదన్ వున్నారు

# సిద్దు రెడ్డిని సన్మానించిన సీపీఐ నాయకులు



**శంషాబాద్,అక్టోబర్ 28(జనం సాక్షి) :** సామాజిక సేవా కార్యక్రమాలతో పేదలకు అండగా నిలుస్తున్న సిద్దు రెడ్డిని సీపీఐ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ నెల 30న శంషాబాద్ హైస్కూల్ గ్రౌండ్‌లో యూట్యూబ్ వేదికగా విడుదల కానున్న 'ఓ నా సిద్దయ్య' పాట ఆవిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ శంషాబాద్ మండల కార్యదర్శి నరగిరి, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాచమల్ల యాదగిరి, నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు నరేష్ నాయక్, శాఖ కార్యదర్శి అనిత, రాజు తదితరులు ఆయన్ని కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# శంషాబాద్ను కరువు మండలంగా ప్రకటించడం హర్షణీయం

### రైతులకు ఎంతో ఉపశమనం అనేగౌని శ్రీకాంత్ గౌడ్



**శంషాబాద్, అక్టోబర్28 (జనంసాక్షి) :** శంషాబాద్ మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించడం హర్షణీయమని నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనేగౌని శ్రీకాంత్ గౌడ్ అన్నారు. కరువు పరిస్థితులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఈ నిర్ణయం ఎంతో ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే టీ. ప్రకాష్ గౌడ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కరువు మండలంగా గుర్తింపు లభించడంతో రైతులకు ప్రభుత్వ సహాయక చర్యలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అలియాబాద్‌లో అక్రమ షెడ్డు నిర్మాణాలు





**శామీర్ పేట్, అక్టోబర్ 28(జనం సాక్షి ) :** అలియాబాద్ మున్సిపాలిటిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని అధికారులు అక్రమ నిర్మాణాలను పట్టించుకోవడం లేదని అలియాబాద్ మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ గాదె వెంకటేష్ ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. అలియాబాద్లోని సర్వే నెంబర్ 10లో అక్రమంగా భారీ షెడ్డు నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. అక్రమ నిర్మాణాలను సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మున్సిపల్ ఆదాయానికి గండిపడుతుందని వాపోయారు. ప్రభుత్వం నుంచి ఏలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్రమ షెడ్లను తొలగించుటకు పిర్యాదు చేస్తామని కౌన్సిలర్ గాదె వెంకటేష్ హెచ్చరించారు.